క్లుప్తంగా

భక్తులకు అన్నదానం

భాకరాపేట: తిరుమల శ్రీవారి దర్శనానికి కాలి నడకన వెళ్లే శ్రీవారి భక్తులకు బుధవారం అన్నదానం చేశారు. కర్ణాటక నుంచి వస్తున్న భక్తులకు చిన్నగొట్టిగల్లులోని యండపల్లివారిపల్లె వద్ద బుగ్గారెడ్డి కుటుంబ సభ్యులు అన్నదానం చేశారు. అలాగే చిన్నగొట్టిగల్లు చెరువు కట్ట మీద గంగమ్మ ఆలయం ఆధ్వర్యంలోనూ అన్నదానం చేపట్టారు. ఎర్రావారిపాళెం మండలం మీదుగా అన్నమయ్య, కడప జిల్లాల నుంచి వచ్చే శ్రీవారి భక్తులకు ఎర్రావారిపాళెం జెడ్పీ హైస్కూల్ టీచర్ సదాశివరెడ్డి అల్పాహారం, తేనీరు, బిస్కెట్స్, పండ్లు అందజేశారు.

సిగ్నల్ ఫ్రీగా పూర్ణకుంభం సర్కిల్

తిరుపతి క్రైమ్: తిరుపతి ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో ఉన్న పూర్ణకుంభం సర్కిల్‌ను సిగ్నల్ ఫ్రీ సర్కిల్‌గా చేసేందుకు కార్యాచరణను రూపొందించినట్లు జిల్లా ఎస్పీ పరమేశ్వర్ రెడ్డి తెలిపారు. ఆయన బుధవారం మున్సిపల్, ఆఫ్కాన్ ఇంజినీర్లతో కలిసి బస్టాండ్ సమీపంలో ట్రాఫిక్ సమస్యను తగ్గించేందుకు తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. నలువైపుల నుంచి పూర్ణకుంభం కూడలికి చేరుకునే వచ్చే వాహనదారులకు ఫ్రీ యూటర్న్ ఉండేలా మార్పులు చేయాలని కోరారు.

ఘనంగా పెన్షనర్స్ డే



మాట్లాడుతున్న మనోహరం

తిరుపతి కల్చరల్: వెస్ట్ చర్చి సమీపంలోని ఆర్‌పీఎఫ్ బ్యారక్స్‌లో బుధవారం పెన్షనర్స్ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఆర్‌పీఎఫ్ పెన్షనర్స్ అసోసియేషన్ కార్యదర్శి మనోహరం, తిరుపతి ఆర్‌పీఎఫ్ ఇన్‌స్పెక్టర్ మధుసూదన్, ఆర్‌పీఎఫ్ పెన్షనర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు మురుగేషన్, ఉపాధ్యక్షుడు శ్రీధర్‌రెడ్డి పాల్గొన్నారు.

మనసును కదిలించిన సాంఘిక నాటకం



కళాకారులకు పారితోషికం, జ్ఞాపికలు అందజేస్తున్న కోనేటి సుబ్బరాజు

తిరుపతి కల్చరల్: నేటి సమాజంలో కుటుంబ వ్యవస్థలో మారుతున్న పిల్లల తీరు, ఫలితంగా పెద్దలకు ఎదురవుతున్న కష్టాలను సాంఘిక నాటికలు ఆవిష్కరించి ప్రేక్షకుల మనసులను కదిలించాయి. ఎస్ఆర్ నాట్య కళాపరిషత్ వార్షిక కళోత్సవాల్లో మూడో రోజు బుధవారం మహతి కళాక్షేత్రంలో పలు సాంఘిక, పౌరాణిక నాటకాలు, నృత్యాలు ప్రదర్శించారు. అంతకు ముందు కళాకారులు, పిల్లలకు శాస్త్రీయ నృత్య, భగవద్గీత పఠన పోటీలు నిర్వహించారు. నిర్వాహకుడు కోనేటి సుబ్బరాజు కళాకారులకు పారితోషికం, జ్ఞాపికలు అందజేసి సత్కరించారు.

రూ.1700 కోట్లతో తిరుపతి అభివృద్ధి



మాట్లాడుతున్న భూమన కరుణాకరరెడ్డి



ఏపీకి జగనే ఎందుకు కావాలంటే కార్యక్రమంలో పాల్గొన్న ప్రజలు

- జనవరి 1 నుంచి రూ.3 వేల పెన్షన్
- అధికారం కోసం ఉత్తుత్తి హామీలిచ్చే వ్యక్తి చంద్రబాబు
- టీటీడీ చైర్మన్, ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి

తిరుపతి మంగళం: అధికార దాహంతో చంద్రబాబులా ఉత్తుత్తి హామీలు కాకుండా 99 శాతం హామీలు అమలు చేసి మాట తప్పని నాయకుడిగా ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి చరిత్రలో నిలిచిపోయారని టీటీడీ చైర్మన్, తిరుపతి ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి స్పష్టం చేశారు. ఆయన బుధవారం తిరుపతి పరిధిలోని 1, 29, 38, 48 డివిజన్లలో ×ఏపీకి జగనే ఎందుకు కావాలంటే₹ కార్యక్రమం నిర్వహించారు. సంక్షేమ పథకాల బోర్డులను ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ అవ్వాతాతలకు జనవరి 1 నుంచి రూ.3 వేల పెన్షన్‌ను అందజేయనున్నట్టు పేర్కొన్నారు. నిత్యం ప్రజాసంక్షేమమే లక్ష్యంగా అనేక సంక్షేమ పథకాలను అందిస్తున్న వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలో ఉంటే మరిన్ని సంక్షేమ పథకాలు అందిస్తారని తెలిపారు. నాలుగున్నరేళ్లలో సంక్షేమ పథకాల ద్వారా ప్రజలకు రూ.3.20 లక్షల కోట్లను అందజేసినట్టు పేర్కొన్నారు. 14 ఏళ్లు ముఖ్యమంత్రిగా పనిచేసిన చంద్రబాబు పేదల కోసం చేసిన అభివృద్ధి ఏమీ లేదన్నారు. అధికారం కోసం ఉత్తుత్తి హామీలు ఇచ్చే ద్రోహి చంద్రబాబు అని దుయ్యబట్టారు.

చరిత్రలో నిలిచిపోయేలా తిరుపతి అభివృద్ధి

జగనన్న చొరవ, సహకారంతోనే ఎన్నడూ లేనంతగా రూ.1700 కోట్లతో తిరుపతిని అభివృద్ధి చేశామన్నారు. తిరుపతిలో తనకు 80 వేల మంది ఓట్లు వేస్తే, 2.15 లక్షల మందికి సంక్షేమ పథకాలు అందజేస్తున్నట్టు తెలిపారు. టీటీడీ ఉద్యోగులకు 7,500 ఇళ్ల పట్టాలు ఇచ్చామన్నారు. 6 వేల మంది పారిశుద్ధ్య కార్మికులకు ఒక్కసారిగా రూ.5 వేలు జీతం పెంచిన ఘనత కూడా జగనన్నదేనన్నారు. తిరుపతి ప్రజల అందరికీ వైకుంఠ ఏకాదశిని పురస్కరించుకుని స్వామి వారి వైకుంఠ ద్వార దర్శనాన్ని కల్పిస్తున్నది కూడా జగనన్న చలువతోనేనని ఎమ్మెల్యే కరుణాకరరెడ్డి తెలిపారు. జగనన్న ప్రభుత్వం మంచి చేసిందని భావిస్తే ఓటు వేసి గెలించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు దొడ్డారెడ్డి సిద్దారెడ్డి, పాముల రమేష్‌రెడ్డి, తలారి రాజేంద్ర, కార్పొరేటర్లు ఆదం రాధాకృష్ణారెడ్డి, నరేంద్ర, ఆదిలక్ష్మి, అన్నా సంధ్య, కో-ఆప్షన్ సభ్యుడు ఎస్‌కె. ఇమామ్, క్లస్టర్ ఇన్‌చార్జ్‌లు ఆదం సుధాకర్‌రెడ్డి, పడమటి కుమార్, వాసుయాదవ్, సురేంద్రరెడ్డి, జేసీఎస్ అధ్యక్షుడు బాలిశెట్టి కిషోర్, దొడ్డారెడ్డి మురళీరెడ్డి పాల్గొన్నారు.

అడుగడుగునా ఆత్మీయత



ప్రభుత్వ పథకాలను వివరిస్తున్న చెవిరెడ్డి లక్ష్మి

తిరుపతి రూరల్: చంద్రగిరి ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి నియోజకవర్గంలో చేసిన అభివృద్ధిని చూసి తన బిడ్డ మోహిత్‌రెడ్డిని ఆదరించాలని చెవిరెడ్డి లక్ష్మి కోరారు. ఆమె బుధవారం తిరుపతి రూరల్ మండలం తనపల్లిలో ఆత్మీయ పలకరింపు కార్యక్రమం చేపట్టారు. సర్పంచ్ సునీత, సుబ్రమణ్యంరెడ్డి ఘన స్వాగతం పలికారు. గజమాలతో సత్కరించారు. గడప గడపకూ వెళ్లి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ కార్యక్రమాలు, ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, తుడా చైర్మన్ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి చేపట్టిన అభివృద్ధి, సేవా కార్యక్రమాలను వివరించారు. రానున్న ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ చంద్రగిరి ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేస్తున్న చెవిరెడ్డి మోహిత్‌రెడ్డిని ఆదరించి గెలిపించాలని చెవిరెడ్డి లక్ష్మి కోరారు. వైఎస్సార్ సీపీ తిరుపతి రూరల్ మండల అధ్యక్షుడు పార్లపల్లి దామోదర్‌రెడ్డి, సర్పంచ్ సునీత, సుబ్రమణ్యం రెడ్డి, కన్వీనర్ మోహన్‌రెడ్డి, మాజీ సర్పంచ్ నాగరాజు, హరనాథరెడ్డి పాల్గొన్నారు.

కలెక్టరేట్‌లో నేడు క్రిస్మస్

తిరుపతి అర్బన్: కలెక్టరేట్‌లో గురువారం క్రిస్మస్ హైటీ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు జిల్లా మైనారిటీ సంక్షేమ అధికారి కె.చిన్నారెడ్డి తెలిపారు. మధ్యాహ్నం 3 గంటలకు కలెక్టర్ కె.వెంకటరమణారెడ్డి నేతృత్వంలో కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు వెల్లడించారు.



ఉద్యోగమస్తు



ఉద్యోగ మేళాకు తరలివచ్చిన యువతి, యువకులు

- వైఎస్సార్ జాబ్ మేళా.. నెరవేరిన యువత కల
- నిర్వాహకులకు కృతజ్ఞతలు తెలిపిన అభ్యర్థులు

చంద్రగిరి: చంద్రగిరి నియోజకవర్గ వ్యాప్తంగా నిరుద్యోగ యువత కోసం తుడా చైర్మన్ చెవిరెడ్డి మోహిత్ రెడ్డి పెద్ద ఎత్తున జాబ్ మేళా ఏర్పాటు చేశారు. దీంతో చంద్రగిరి ప్రభుత్వ బాలుర కళాశాల మైదానానికి బుధవారం పెద్ద ఎత్తున యువత పోటెత్తారు. సుమారు 4,300కు పైగా ఇంటర్వ్యూలకు హాజరయ్యారు. అప్పటికప్పుడు 1,400కి పైగా అభ్యర్థులకు ఉద్యోగాల నియామక లెటర్లను తుడా చైర్మన్ చెవిరెడ్డి మోహిత్ రెడ్డి అందజేశారు. ఎంపికైన అభ్యర్థులకు ఆయా కంపెనీల అధికారులు త్వరలో వారికి అపాయింట్‌మెంట్ ఆర్డర్లను పంపిచనున్నట్లు తెలిపారు. ఉద్యోగాలకు ఎంపికైన అభ్యర్థులు ఎనలేని సంతృప్తిని వ్యక్తపరిచారు.

యువ నేత మోహిత్‌కు కృతజ్ఞతలు



నేను డిగ్రీలో కంప్యూటర్ కోర్సు పూర్తిచేశాను. ఏడాదిగా ఎన్నో కంపెనీల్లో ఇంటర్వ్యూలకు హాజరయ్యాను. ఎక్కడా నా చదువుకు తగిన ఉద్యోగం నాకు దొరకలేదు. చంద్రగిరిలో వైఎస్సార్ మెగా జాబ్‌మేళా గురించి తెలుసుకుని ఇంటర్వ్యూలకు హాజరయ్యాను. రుయా ఆస్పత్రిలో నెలకు రూ.20వేల వేతనంతో కొలువు దొరికింది. నా కుటుంబానికి ఆసరాగా నిలుస్తుంది. ఇంతటి అవకాశం కల్పించిన తుడా చైర్మన్ చెవిరెడ్డి మోహిత్ రెడ్డికి కృతజ్ఞతలు. –దీప, తొండవాడ, చంద్రగిరి మండలం

అమర రాజలో ఉద్యోగం పొందాను



2009లో ఐటిఐ పూర్తి చేసి ఇక్కడ సరైన అవకాశాలు లేకపోవడంతో బెంగళూరుకు వెళ్లాను. అక్కడ రెండేళ్ల పాటు పలు ప్రైవేటు కంపనీల్లో ఉద్యోగం చేస్తూ వచ్చాను. చంద్రగిరిలో జాబ్ మేళా తెలుసుకుని ఇక్కడ వచ్చి ఇంటర్వ్యూకు హాజరయ్యాను. అమరరాజలో శిక్షణ పొందుతూ రూ.13.5వేలు, శిక్షణ పూర్తిచేసుకున్న తర్వాత రూ.21వేల వేతనంతో అవకాశం వచ్చింది. తుడా చైర్మన్ చెవిరెడ్డి లాంటి యువ నాయకులు మాకు అండగా నిలవడం సంతోషంగా ఉంది. –జ్ఞాన తేజారెడ్డి, తిరుపతి

చెన్నైలో ఉద్యోగం వచ్చింది



చంద్రగిరిలో వైఎస్సార్ మెగా జాబ్ మేళా నిర్వహిస్తున్నారని తెలిసి పక్క నియోజకవర్గం నుంచి వచ్చాను. డిగ్రీ పూర్తి చేసి ఇంటి వద్దే నా బిడ్డతో కలసి ఉంటున్నాను. నా భర్త చెన్నైలో ఓ ప్రైవేటు కంపెనీలో పనిచేస్తున్నారు. ఇంటర్వ్యూలో నెలకు రూ.22వేల వేతనంతో చెన్నైలో కొలువు అందించేలా డీఎస్‌పీ అనే కంపెనీతో ఒప్పందం కుదిరింది. త్వరలోనే చెన్నైలో నాకు ఉద్యోగం రానుంది. మా కుటుంబానికి అసరాగా నిలిచిన తుడా చైర్మన్ చెవిరెడ్డి మోహిత్ రెడ్డి, ఎమ్మెల్యే చెవిరెడ్డి లాంటి వారికి ఎప్పుడూ రుణపడి ఉంటాం. –రేఖ, రొంపిచర్ల

యువతకు మార్గదర్శకం మోహిత్ రెడ్డి



మా లాంటి ఎంతోమంది నిరుద్యోగ యువతకు మార్గదర్శకంగా చెవిరెడ్డి మోహిత్ రెడ్డి నిలుస్తున్నారు. నేను వివాహం చేసుకుని ఇంట్లో ఉండడం ఇష్టంలేదు. స్వయంకృషితో ఎదగాలన్నదే నా అభిలాష. ఇలాంటి సమయంలో నేను ఇంటర్వ్యూలకు హాజరుకావడంతో అపోలో ఫార్మసీలో ఫార్మాసిస్ట్‌గా ఎంపికయ్యాను. తుడా చైర్మన్ లాంటి యువ నాయకుల వల్లే ఇది సాధ్యం. జయహో చెవిరెడ్డి మోహిత్. –చాముండేశ్వరి, తిరుపతి





మెకానిక్‌లను అసంఘటిత కార్మికులుగా గుర్తించాలి

తిరుపతి కల్చరల్: టూవీలర్స్ మెకానిక్‌లను అసంఘటిత కార్మికులుగా గుర్తించి ఆదుకోవాలని తిరుపతి జిల్లా టూవీలర్స్ మెకానిక్ అసోసియేషన్ అధ్యక్షుడు ఆవుల మునిరెడ్డి ప్రభుత్వాన్ని కోరారు. గాంధీ భవన్‌లో బుధవారం టూవీలర్స్ మెకానిక్స్ అసోసియేషన్ సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రమాదాలకు గురైన మెకానిక్‌లకు ఆర్థిక సాయం అందిస్తున్నట్లు తెలిపారు. భవిష్యత్తులో ఆర్థికంగా వెనుబడిన వికాలంగులైన మెకానిక్స్‌కు రూ.50 వేలు, మృతి చెందిన మెకానిక్ కుటుంబానికి రూ.లక్ష ఇవ్వనున్నట్టు పేర్కొన్నారు. అలాగే మెకానిక్స్ సమస్యల పరిష్కారంపై ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి, తిరుపతి ఎమ్మెల్యే అభ్యర్థి భూమన అభినయరెడ్డిని కలిసి వినతి పత్రం సమర్పించనున్నట్లు తెలిపారు. అనంతరం అసోసియేషన్ జిల్లా నూతన కార్యవర్గాన్ని ఎంపిక చేశారు. కార్యదర్శిగా జలంధర్, సహాయ కార్యదర్శిగా గురునాథ్ ఆచారి, ఉపాధ్యక్షుడిగా ప్రభు, కమిటీ ఇన్‌చార్జ్‌గా సోమశేఖర్, మరో 11 మంది కమిటీ సభ్యులను ఎంపిక చేశారు. కార్యక్రమంలో అసోసియేషన్ గౌరవాధ్యక్షుడు మల్లేశ్వరన్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు పి.లక్ష్మణరావు, నరేంద్రబాబు, రాము, మురగ, బాలకృష్ణ, లోకనాథం పాల్గొన్నారు.

బాలాజీ టూవీలర్స్ మెకానిక్ అసోసియేషన్

తిరుపతి కల్చరల్: టూ వీలర్ మెకానిక్‌లకు త్వరలో ఈఎస్‌ఐ సౌకర్యం కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నట్టు బాలాజీ టూ వీలర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎస్ఆర్.బాషా తెలిపారు. యూత్ హాస్టల్లో బుధవారం అసోసియేషన్ సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రాబోయే రోజుల్లో సరికొత్త టెక్నాలజీతో విడుదలకానున్న కొత్త ద్విచక్రవాహనాలపై మెకానిక్‌లకు సమగ్ర శిక్షణ ఇవ్వనున్నట్టు పేర్కొన్నారు. సభ్యుల ఆర్థికాభివృద్ధి, వారి సంక్షేమం కోసం కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ ఉపాధ్యక్షుడు కృష్ణారెడ్డి, కార్యదర్శి సాయికిరణ్, కోశాధికారి విశ్వనాథ్, మోహన్, సేతు ఆచారి పాల్గొన్నారు.

దివ్యాంగులకు బహుమతులు



బహుమతులు అందజేస్తున్న తహసున్నీషా

తిరుపతి కల్చరల్: బైరాగిపట్టెడ ఎంజీఎం పాఠశాల ఆవరణలోని భవిత కేంద్రంలో బుధవారం అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించా రు. విద్యార్థులకు పోటీలు నిర్వహించి ఉయ్ సపోర్ట్ చారిటబుల్ ట్రస్ట్ తహసున్నీషా బహుతులు అందజేశారు.

ట్రాన్స్‌ఫార్మర్ పరిశీలన

పాకాల: స్థానిక ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలో ప్రమాదకరంగా ఉన్న ట్రాన్స్‌ఫార్మర్‌ను మార్చాలని జెడ్పీటీసీ నంగా పద్మజారెడ్డి విద్యుత్ శాఖ అధికారులకు సూచించారు. ఆమె బుధవారం విద్యుత్ శాఖ అధికారులతో కలిసి ట్రాన్స్‌ఫార్మర్‌ను పరిశీలించారు. 10 రోజుల్లో సురక్షిత ప్రాంతానికి తరలిస్తామని అధికారులు తెలిపారు.

ఆర్టీసీకి సహకరించండి

తిరుపతి అర్బన్: ఆర్టీసీకి సహకరించాలని, ప్రైవేటు వాహనాల తాకిడి ఆర్టీసీ బస్టాండ్లలో అడ్డకట్ట వేయాలని ఏపీ జాయింట్ ట్రాన్స్‌పోర్ట్ రాయలసీమ జోన్ కమిషనర్ ఎం.బసిరెడ్డిని ఆర్టీసీ ఇన్‌చార్జి ఈడీ చెంగల్‌రెడ్డి కోరారు. ఆయన బుధవారం బసిరెడ్డిని కలిసి సత్కరించారు. స్పందించిన బసిరెడ్డి ఆర్టీసీకి సహకరిస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో డెప్యూటీ సీటీఎం భాస్కర్‌రెడ్డి పాల్గొన్నారు.



ఆడుదాం-ఆంధ్ర క్రీడల కిట్ల పంపిణీ

భాకరాపేట: ఆడుదాం-ఆంధ్ర కిట్లను బుధవారం చిన్నగొట్టిగల్లు ఎంపీపీ బాలం యుగంధర్‌రెడ్డి, సీడీసీఎంఎస్ చైర్మన్ సహదేవరెడ్డి పంపిణీ చేశారు. వారు మాట్లాడుతూ 43 రోజుల పాటు జరిగే ఆడుదాం-ఆంధ్ర క్రీడలను సచివాలయాల స్థాయి నుంచి మండల, నియోజకవర్గ, జిల్లా, రాష్ట్ర స్థాయి వరకు నిర్వహించేందుకు అవసరమైన వేదికలను సిద్ధం చేస్తున్నట్టు తెలిపారు.

హుండీ ఆదాయం రూ.6.33 లక్షలు

చంద్రగిరి: చంద్రగిరి గ్రామదేవత మూలస్థాన ఎల్లమ్మ హుండీ నుంచి రూ.6.33 లక్షల ఆదాయం వచ్చినట్టు ఆలయ చైర్మన్ యారాశి చంద్రశేఖర్ రెడ్డి తెలిపారు. ఆగస్టు 22 నుంచి మంగళవారం వరకు(120 రోజులు) హుండీలో భక్తులు సమర్పించిన కానుకలను బుధవారం లెక్కించారు. ఈ సందర్భంగా రూ.6,60,391లు వచ్చినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మదనపల్లి డివిజన్ ఆలయాల తనిఖీ అధికారి కిరణ్ కుమార్ రెడ్డి, ఈవో తిమ్మారెడ్డి, మాజీ చైర్మన్ సతీష్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. అదే విధంగా తిరుపతి రూరల్ మండలం కొత్త చెర్లోపల్లిలో వెలసిన ఆంజనేయ స్వామి ఆలయం హుండీ నుంచి రూ.1,14,471 ఆదాయం వచ్చినట్లు ఆలయ అధికారులు తెలిపారు.

ప్రతి ఒక్కరికీ పని కల్పించాలి

రామచంద్రాపురం: ఉపాధిహామీ పథకంలో అర్హులైన ప్రతిఒక్కరికీ పని కల్పించాలని ఏపీడీ పద్మలత ఆదేశించారు. ఆమె బుధవారం రాయలచెరువు పంచాయతీ కార్యాలయ ఆవరణలో గ్రామసభ నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ 2024–25 సంవత్సరానికి గాను గుర్తించిన కొత్త పనులను వివరించారు. రైతులు ఉపాధిహామీలో మునగ, జామ, దానిమ్మ, రోజా పూలతోటలు సాగు చేసుకోవచ్చని తెలిపారు. రైతులు పని ప్రదేశంలో ఫొటోలను తీసి యాప్‌లో పొందుపరచాలని సూచించారు.



